

చెహోవ్ కథ

# సోదా

మాషెంకా ఇటీవలే చదువు పూర్తిచేసి కుష్కిన్ వాళ్లింట్లో ఆయాగా చేరింది. ఒకనాడామె బజారునించి వచ్చేసరికి యిల్లంతా గోలగోలగా వుంది. తలుపు దగ్గరి బంట్రోతు మొహం కూడా అవమానంతో ఎర్రబడింది.

మేడపైనుండి అరుపులు వినిపిస్తున్నాయి.

"అమ్మగారూ, అయ్యగారూ పోట్లాడుకున్నట్టుంది."

"లేదు లేదు. అమ్మగారు మూర్ఛ పోయినట్టుంది"

మెట్లమీద పనిమనుషులు అటూ యిటూ పరుగెత్తుతున్నారు. ఒకరిద్దరేడుస్తున్నారు.

నిగనిగ మెరిసే బట్టతల. గుండ్రటి కారట్ రంగు మొహం. పొట్టికాళ్లు. ఆయనే ఇంటి యజమాని నికొలాయ్. రొప్పుతూ కిందికి వచ్చాడు. ఉద్రేకంతో ముక్కు అదురుతున్నది.

"తప్పు ఎవరు చేసినా తప్పే. పాపం." అంటూ తలవంచుకుని, చేతులు పిసుక్కుంటూ వెళ్లిపోయాడు.

మాషెంకా తన గదిలోకి వెళ్లింది.

పేదలూ, నిస్సహాయులూ ధనికుల అండ జేరినప్పుడు తరచుగా జరిగే అవమానమే అక్కడ దర్శనమిచ్చింది. ఆ గదిని సోదా చేశారు. యజమానురాలు ఫెడోసియా కిందపడ్డ వస్తువుల్ని తిరిగి సంచీలో వేస్తున్నది. పిడుగువాత పడ్డట్టుగా మాడిన మొహంతో నిల్చున్న మాషెంకాను చూసి తత్తరపడింది.

"... నేనేం చెయ్యలేదు... కిందపడిన వాటిని టేబుల్ మీద పెడుతున్నాను..."

అక్కడ నిల్చోలేక యజమానురాలు వెళ్లిపోయింది. దొంగలు పడ్డట్టుగా వుంది గది. యజమానురాలు దేనికోసం వెదికిందీ గదిలో. యజమాని ఏదో గొణుక్కుంటూ పోతున్నాడెందుకు? టేబుల్ సొరుగులెందుకు లాగి చూశారు? తను చిల్లర డబ్బులు దాచుకొనే డబ్బీని ఎందుకు తెరిచారు? అసలు తాళంచెవి లేకుండా టేబుల్ సొరుగులెలా తెరవగలిగారు? షెల్ఫులోని పుస్తకాలు, కిటికీ మీది బొమ్మలు, ఎక్కడా ఏ వస్తువూ తను పెట్టినట్టుగా లేదు. గదిని అంగుళమంగుళం వెదికారు. తలుపు దగ్గరి బంట్రోతు మొహం జ్ఞాపకం వచ్చింది. ఏడుస్తూ, పరిగెడుతున్న మనుషులు. అవమానంతో, అసహ్యంతో, భయంతో కుంగిపోయింది మాషెంకా. ఒంట్లో వణుకొచ్చింది.

ఓ పనిమనిషి వచ్చింది.

"లీసా, ... నా గదినెవరో సోదా చేశారు... ఎవరు..."

"అమ్మగారి జడపిన్ను పోయింది. వజ్రాలది. రెండువేల రూబుళ్లట."

"అయితే నా గదెందుకు సోదా చేయటం?"

"అందర్నీ వెదికారు. నన్ను కూడా. మమ్మల్నైతే బట్టలు కూడా విడిపించారు. ఆ పిన్ను సంగతే నాకు తెలియదు. ఆమె డ్రెస్సింగ్ టేబుల్ ఛాయలకైనా పోదు. పోలీసులనడిగినా అదే చెబుతాను."

"నామీదెందుకు అనుమానం?"

మాషెంకాకు అర్థం కాని ప్రశ్న అదే.

"అమ్మగారు అందర్నీ పరీక్ష చేసింది, స్వయంగా. కాపలా బంట్రోతును కూడా. అయ్యగారికేమో అమ్మగార్ని చూస్తే హడల్. పోన్లే. నీ గదిలో వాళ్లకేమీ దొరకలేదు."



**రష్యన్ మూలం: చెహోవ్**
**తెలుగు గొంతు: కరుణారుణ**

"అది కాదు లీసా, మనుషుల్ని అనుమానించటమే చాలా నీచమైన విషయం. నా గురించి అంత దారుణంగా ఆలోచించడానికి ఆమెకేమి హక్కున్నది..."

"చదువుకుంటే సరిపోతుందా మాషెంకా. ఇది నీ యిల్లు కాదు. ఇక్కడ నువ్వు పనిమనిషికన్నా ఎక్కువేమీ కాదు. యజమానులంటే మీ అమ్మా, నాన్న అనుకోకు."

మాషెంకాకు దుఃఖం ఆగలేదు. ఇంత హేయమైన అనుభవం ఆమెకింతవరకూ కలగలేదు. చదువు, సంస్కారం వున్నది. తన తండ్రి టీచరు. పిల్లలకు పాఠాలు చెప్పటానికీ, మంచి బుద్ధులు నేర్పించి క్రమశిక్షణలో పెట్టడానికే యిక్కడకు వచ్చింది. తనకు దొంగతనం అంటగడతారా? ఇంతకన్నా అవమానం వుండదు. భయంతో చెమటలు పట్టింది. పోలీసులు వచ్చి, సంకెళ్లు వేసి, తనను రోడ్లమీద ఈడ్చుకు పోతున్నట్టుగా వూహించుకుంది. తరువాత లాకప్‌లో వేస్తారు. అక్కడ ఎలుకలన్నీ వచ్చి తనను కరుచుకు తింటాయి. అమ్మా, నాన్న ఎక్కడో దూరదేశంలో వున్నారు. ఇంత దూరం రావటానికి వాళ్లకు డబ్బులేదు. ఈ మహానగరంలో తనొక్కతి.

ఎందుకూ భయం? కోర్టులో తన తరఫున తను వాదించుకోగలదు. నిజం గెలుస్తుంది.

మధ్యాహ్నం భోజనం చేసేటప్పుడు రెండు స్వీట్లు దాచుకొని తెచ్చి బుట్టలో పెట్టుకుంది. అవి వీళ్లకు కనిపించి వుంటాయి. తన ఈ చిన్న రహస్యం కూడా వాళ్లకు తెలిసిపోయినందుకు తల కొట్టేసినట్లుగా వుంది.

డిన్నర్‌కు మాషెంకా ఆలస్యంగా వెళ్లింది. అప్పటికే అందరూ తింటున్నారు. యజమానురాలు చిర్రుబుర్రు మంటున్నది.

"కోపంతో బీపీ వస్తుంది. మీ ఆరోగ్యం రెండువేల రూబుల్లకన్నా ముఖ్యం." డాక్టరుగారు సలహా యిస్తున్నాడు.

"నగ పోయినందుకు కాదు నేను బాధపడుతున్నది." అంటూ ప్రారంభించింది యజమానురాలు, 'ఇంతింత జీతాలిచ్చి, సొంత మనుషుల్లాగా చూసుకుంటున్నానే. ఇలా జరిగిందంటే, దొంగల్ని పోషిస్తున్నట్టే గద. ఎంత కృతఘ్నత. నా ప్రేమకు ప్రతిఫలమా యిది!"

అందరూ తననే చూస్తున్నట్టుగా అనిపించింది మాషెంకాకు.

"తలనొప్పిగా వుంది." అంటూ లేచింది.

"పాపం, గది సెర్చి చేసినందుకు బాధపడుతున్నది." అంటూ గొణిగాడు యజమాని.

"ఆ పిల్ల తీసిందని నేను చెప్పానా? అది అమాయకురాలని మీరు హామీ ఇవ్వగలరా? అసలీ చదువుకున్న పిల్లల్ని చూస్తే నాకు అనుమానంగా వుంటుంది."

"అది కాదు. చట్టపరంగా చూస్తే, ఒకర్ని సోదాచేసే హక్కు మనకు లేదు. తెలుసా?"

"చట్టాలూ, సెక్షన్లూ కాదు. నాకు నా నగ కావాలి. నాకెవరూ నీతులు బోధించక్కర్లేదు" అంటూ చేతిలోని ఫోర్కు ధన్‌మంటూ విసిరేసింది యజమానురాలు.

ఆమె భర్త నిట్టూర్చాడు.

మాషెంకాకు లోపల రగిలిపోతున్నది. ఆ డబ్బున్న అహంకారిని లెంపలు వాయించాలని వున్నది. అలాటి నగ మరొకటి కొని దాని

*"చదువుకుంటే సరిపోతుందా మాషెంకా. ఇది నీ యిల్లు కాదు. ఇక్కడ నువ్వు పనిమనిషికన్నా ఎక్కువేమీ కాదు. యజమానులంటే మీ అమ్మా, నాన్న అనుకోకు."*

మొహాన కొడితే! ఈ సంపన్నురాలు, వున్నదంతా పోగొట్టుకుని ఒకనాడు తనవద్దకు ముష్టెత్తుకుంటూ వస్తే. ఆస్తి కలిసివస్తే, తనుకూడా యిలా విలాసంగా తిరగగలిగితే...

కాని అవన్నీ పగటికలలు. వీలైనంత త్వరగా యిల్లు విడిచివెళ్లటం తప్ప గత్యంతరం లేదు. ఒక్క నిమిషం కూడా వుండకూడదిక్కడ. ఉన్న ఒక ఆధారమూ పోతుంది. తనను పోషించటానికి తల్లిదండ్రుల దగ్గిర డబ్బుకూడా లేదు. అయినా సరే, గదిసోదా చేయటమంటే మానభంగం చేసినట్టే.

తన సామాను సర్దుకోసాగింది మాషెంకా.

ఇంటి యజమాని నికొలాయ్ వచ్చి తలుపు తట్టాడు.

"రండి".

కాస్త తాగినట్టుంది. దిగులుగా వున్నాడు.

"ఇదంతా ఏమిటి?"

"నన్ను అవమానించే చోట వుండలేను."

"సెర్చి చెయ్యటం తప్పే. కాని ఏమీ దొరకలేదుగా. మర్చిపో."

ఒక పెట్టెలో బట్టలూ, మరొక పెట్టెలో యితర వస్తువులూ సర్దింది.

"నా భార్య కాస్త తొందర పడిందిగాని మరీ అంత చెడ్డదేం కాదు."

మాషెంకా ఆ మాటల్ని వినిపించుకోలేదు.

"నీ భార్య తరఫున నేను క్షమించమని కోరనా?"

ఈ ఇంట్లో తనకేం విలువుందనుకొని ఇలా మాట్లాడుతున్నాడితడు!

భార్యా విధేయుడు కాడు. అంతకన్నా తక్కువ. ఓ పెంపుడు జంతువులాంటి మనిషి.

నికొలాయ్ తన అభ్యర్థనలు ఆపలేదు.

"మీరెందుకు బాధపడటం"

"పొరబాటే నంటున్నానుగా. ఇంకెలా చెప్పాలి? కాళ్లు పట్టుకోనా? నువ్వు బాధ పడ్డావు. ఏడ్చావు. నేనూ బాధ పడ్డాను. నాకూ ఆత్మగౌరవముంటుంది. ఎవరికీ చెప్పలేని రహస్యాలు కొన్ని నాకూ వుంటాయి.

మాషెంకా మాట్లాడలేదు.

"ఆ నగ తీసింది నేనే. చాలా? ఇప్పుడు సంతోషమా? జాగ్రత్త ఈ విషయం మూడో మనిషికి తెలియకూడదు."

ఆశ్చర్యంతో, భయంతో మాషెంకాకు ఏమనాలో తోచలేదు. అయితే, యిలాంటి మనుషులున్నా యింట్లో అస్సలుండకూడదు.

"నువ్వలా ఆశ్చర్యంగా చూడకు. ఏం చెయ్యమంటావు మరి! నాకు డబ్బు కావాలి. నా భార్య నా ఖర్చులకు యివ్వదు. ఇది నా తండ్రి ఆస్తి. ఆ నగ మా అమ్మది. కాని వాళ్లు ఆస్తీ, నగలూ అన్నీ దానిపేర రాసి పోయారు. కోర్టుకు పోయినా లాభంలేదు. ఏం చెయ్యను మరి. నన్ను క్షమించు."

"ప్లీజ్. నన్నొంటరిగా వదలండి." అంది మాషెంకా దుఃఖాన్ని ఆపుకో ప్రయత్నిస్తూ.

నికొలాయ్ బలహీనంగా నవ్వుతూ, "ఈలోకంలో ఇంకా ఇలాంటి చిన్న చిన్న అవమానాలకు బాధపడే వాళ్లున్నారన్నమాట. అయితే, వెళుతున్నావంటావు. అదే నీ చివరి నిర్ణయమా? నువ్వు పోతావులే. నా సంగతేమిటి? ఈ జైలునుంచి నాకెప్పుడు విముక్తి? అందరూ నీతులు చెప్పేవాళ్లే. నీకేం తక్కువైందని. నీకెందుకు డబ్బు. దుబారా చెయ్యద్దు. అంటూ".

హాల్లోంచి యజమానురాలి గొంతు వినిపించింది.

"అయ్యగార్ని రమ్మను."

"వెడతావా? నా ఉద్దేశంలో, ఈ యింట్లో వున్న ఒకే ఒక్క మనిషివి నువ్వు. మిగతా వాళ్లంతా అంటావా. వాళ్ల గురించి నేను చెప్పను."

నికొలాయ్ బతిమాలుతూనే వున్నాడు. అరగంట తర్వాత మాషెంకా గేటు దాటింది. ■